క్లుప్తంగా

గద్దర్‌కు నివాళి



గద్దర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణ పరిధిలోని తెల్లాపూర్‌లో ఆదివారం రాత్రి కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గద్దర్ కుమార్తె వెన్నెల మాట్లాడుతూ విద్యార్థులు, అమరవీరుల త్యాగాలు, ప్రజా ఉద్యమాలతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కళాకారులు, ఉద్యోగులు, కార్మికులు, కులసంఘాలు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రజాసంఘాలు, అన్ని వర్గాలు ముందుండి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారని వివరించారు. వచ్చే ఏడాదిలో ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని అమరవీరుల కుటుంబాలతో కలిసి నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గద్దర్ గళం ఫౌండర్ చైర్మన్ కొల్లూరి సత్తయ్య, బీఎస్పీ సీనియర్ నాయకులు బాలయ్య, ఆస్క్ డైరెక్టర్ సుదర్శన్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, నాయకులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన ఘటన ఖేడ్ మండల పరిధిలోని హుంక్రాన (జి) గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కురుమ మల్గొండకు చెందిన మేక ఎప్పటిలాగే మేత మేస్తూ కంచెలేని సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో మేక అక్కడిక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.10వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు మల్గొండ కోరాడు.

జొన్నల కొనుగోలుకు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

సంగారెడ్డి టౌన్: జొన్నల కొనుగోలు కేంద్రాలను మరో వారం రోజుల పాటు పొడిగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో స్థానిక రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే అన్ని పంటలపై రూ.500 బోనస్ ప్రకటించి చెల్లించాలన్నారు. రైతు రుణమాఫీని మార్చు చేయాలని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ అముదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామానికి చెందిన బేగరి సాయికుమార్(18) డీజిల్ మెకానిక్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 26న విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, దర్యాప్తులో తెలుస్తాయని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడండి

నారాయణఖేడ్: వర్షాలు కురుస్తున్నందునా మురుగుకాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్ సిబ్బందికి సూచించారు. ఖేడ్‌లో ఆదివారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్న నేపథ్యంలో సోమవారం తెల్లవారుజాము నుంచి శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మురుగుకాలువలను పరిశీలించారు. మురుగు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారి శ్రీనివాస్‌కు సూచించారు.

బాబోయ్.. గ్రామ సింహాలు

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- వీధికుక్కల సంచారంతో జనం బెంబేలు
- వస్తువులను సైతం ఎత్తుకెళ్తున్న వైనం
- పెరుగుతున్న కుక్క కాటు బాధితుల సంఖ్య
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



బెల్ కాలనీలో వీధికుక్కల సంచారం

రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకొనిపోవాల్సిన పరిస్థితి ఉంది. ఏ వీధిలో చూసినా వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానిక ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంటి ముందు పెట్టిన వస్తువులను సైతం వీధికుక్కలు ఎత్తుకెళ్తున్నాయి. ఇటీవల తెల్లాపూర్‌లో పిచ్చికుక్క 20మందిని గాయపరిచిన సంఘటన తెలిసిందే.. వీధికుక్కల బెడదలను నివారించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో 5 నెలల్లో 189 మంది కుక్క కాటు బాధితులు చికిత్స తీసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో 38 మంది, ఫిబ్రవరిలో 29 మంది, మార్చిలో 43 మంది, ఏప్రిల్‌లో 37 మంది, మే నెలలో 42 మంది పట్టణ పరిధిలోని ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై ఆరోపణలు

హైదరాబాద్ ప్రధాన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో వీధికుక్కలను పట్టుకొని ఈ ప్రాంతానికి తీసుకొని వచ్చి ఇక్కడ వదిలి వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకనే ఈ ప్రాంతంలో వీధికుక్కల సంఖ్య వేలల్లో పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఇష్టానుసారంగా మాంస వ్యర్థాలను వేయడంతో వాటిని తినేందుకు వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తూ వాహనాదారుల వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వీధికుక్కల బెడదను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

వీధికుక్కల బెడదను నివారించాలి



రామచంద్రాపురం పట్టణ పరిధిలో వీధికుక్కల సంచారం రోజురోజుకు అధికమవుతోంది. తెల్లాపూర్‌లో పిచ్చికుక్క ఇటీవల 20మందిని తీవ్రంగా గాయపరిచింది. దీంతో చిన్నారులను బయటకు పంపించలేని పరిస్థితి ఉంది. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను అరికట్టాలి.

– కొల్లూరి శ్రీనివాస్, తెల్లాపూర్

చర్యలు తీసుకుంటున్నాం



వీధికుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాటిని ఎప్పటికప్పుడు జనన నియంత్రణ యూనిట్‌కు తరలిస్తున్నాం. వీధికుక్కలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వీధికుక్కలను పట్టుకునేందుకు మున్సిపల్ సిబ్బందిని నియమించి కుక్కల బెడదను నివారించేందుకు కృషి చేస్తాం.

– సంగారెడ్డి, కమిషనర్, తెల్లాపూర్ మున్సిపాలిటీ

ఫర్నిచర్ విక్రయం వివాదాస్పదం



ప్రైవేట్ పాఠశాల వద్ద ఫర్నిచర్

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పాత ఫర్నిచర్ విక్రయించడం వివాదాస్పదంగా మారింది. పాఠశాల పాత ఫర్నిచర్‌ను ప్రైవేట్ పాఠశాలకు విక్రయించడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు ఇటీవల కొత్త ఫర్నిచర్ రావడంతో పాత ఫర్నిచర్‌ను తీసివేశారు. అయితే పాత ఫర్నిచర్‌ను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలకు విక్రయించారని, ప్రభుత్వ పాఠశాలలో పనిచేయని ఫర్నిచర్ ప్రైవేట్ పాఠశాలలో ఎలా పనికి వస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జి ఎంఈఓ శంకర్‌ను గ్రామస్తులు ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో కుమ్మక్కై ఫర్నిచర్‌ను కిలోల చొప్పున విక్రయించారని గ్రామస్తులు ఆరోపించారు. పాత ఫర్నిచర్ విక్రయం వివాదాస్పదం కావడంతో హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ చెత్త తొలగింపులో భాగంగా పాత ఫర్నిచర్‌ను విక్రయించామని, పాత ఫర్నిచర్‌ను తిరిగి తెప్పిస్తామని తెలిపారు.

కంది విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్త

జహీరాబాద్: డీడీఎస్–కేవీకే ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. మొగుడంపల్లి మండల పరిధిలోని జీడిగడ్డ తండా, ఒంటిలగడ్డ తండా, సిద్ధాపూర్ తండాల రైతులకు సోమవారం కంది పంట సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటల యాజమాన్య శాస్త్రవేత్త రమేష్ మాట్లాడుతూ డీటీఆర్‌జీ 59 కంది రకం 2021లో తాండూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపారు.

రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి

సంగారెడ్డి టౌన్: వర్షాకాలంలో రైతులకు సరిపడా విత్తనాలు సరఫరా చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడంలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. విత్తనాలను అందుబాటులో ఉంచకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులందరికీ సకాలంలో విత్తనాలను అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను కూడగట్టి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజారెడ్డి, మాణిక్‌రెడ్డి, లింగమూర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- 13 క్వింటాళ్ల ధాన్యం తరుగుపై విచారణకు కలెక్టర్ ఆదేశం
- 10 రోజులు గడుస్తున్నా పట్టించుకోరా?
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు



కలెక్టర్ క్రాంతికి విన్నవిస్తున్న రైతు వెంకట్‌రెడ్డి (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతు ధాన్యంలో 13 క్వింటాళ్ల ధాన్యం కోత విధించడంపై విచారణ చేపట్టాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. కానీ..10రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు నోమన్నగారి వెంకట్‌రెడ్డి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ఇటీవల 511 సంచుల ధాన్యం విక్రయించాడు. తూకం చేసిన తర్వాత లారీలో రైసుమిల్లుకు తరలించగా సగం ధాన్యం దిగుమతి చేసుకున్నాక తేమ, మొలకలు వచ్చిందని తరుగు ఇస్తేనే మిగతా ధాన్యం సంచులను దిగుమతి చేసుకుంటామని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. లేకుంటే ధా న్యం తీసుకువెళ్లాలని మిల్లు యాజమాన్యం తేల్చి చెప్పింది. దీంతో చేసేదేమీలేక సదురు రైతు ఒప్పుకోవడంతో 13 క్వింటాళ్ల ధాన్యం కోత విధించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ మాధురి ఈ నెల 21న కన్‌సాన్‌పల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వస్తున్న విషయం తెలిసిన రైతు వెంకట్‌రెడ్డి కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకొని ధాన్యంలో పెద్ద మొత్తంలో కోత పెట్టారని, న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకోగా ఈ విషయంపై వెంటనే విచారణ చేపట్టాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. దీంతో కోత పడిన ధాన్యం తిరిగి వస్తుందనే ఆశతో ఎదురు చూసినా నిరాశే మిగిలిందని రైతు వెంకట్‌రెడ్డి వాపోయాడు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



511 సంచుల ధాన్యంను కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఆ తర్వాత మిల్లుకు తరలించగా సగం ధాన్యం దించుకున్నాక తేమ, ధాన్యం మొలకెత్తిందని ధాన్యం లారీని పక్కన పెట్టేశారు. దీంతో చేసేదేమీలేక వారు చెప్పినట్లు వినడంతో 13 క్వింటాళ్ల ధాన్యం కోత పెట్టి మిగతా ధాన్యం తీసుకున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఆడినల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. దీంతో అక్కడే ఉన్న అధికారులకు విచారణ చేపట్టాలని ఆదేశించడంతో న్యాయం జరుగుతుందని ఆశపడ్డా. కానీ.. ఇంతవరకూ అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

– వెంకట్‌రెడ్డి, రైతు, కన్‌సాన్‌పల్లి గ్రామం


ఎంపీఓ తీరుపై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

జోగిపేట(అందోల్): అందోలు ఎంపీఓ సౌజన్య కార్యదర్శులను వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని, ఆమెపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం అందోలు ఎంపీడీఓ, ఎంపీపీలకు పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నవంబర్ 2023లో నిర్వహించిన ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లలో ఒక్కొక్క పంచాయతీ కార్యదర్శి ఖర్చు చేసిన రూ.4వేల బిల్లులను ఇప్పటివరకూ అందజేయలేదన్నారు. చెప్పినట్లు ఇవ్వనట్లయితే మీపై చర్యలు తీసుకునేలా ఉన్నత అధికారులకు లేఖ రాస్తానని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీల్లో కార్యదర్శులు సొంత డబ్బులతో పనులు చేయిస్తే ఆ నిధుల కోసం అడిగితే ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఎంపీఓ సౌజన్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎంపీఓను వివరణ కోరగా ఉద్దేశపూర్వకంగానే తనపై ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారని వివరణ ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించిన నిధులు ఏవీ తన వద్ద లేవని, నవంబర్ నెలకు సంబంధించి ఆర్డీఓ కార్యాలయం వారు రూ.2వేల చొప్పున మంజూరు చేయగా అప్పటి ఎంపీడీఓకు అందజేసినట్లు తెలిపారు. ఇందులో తన ప్రమేయం లేదన్నారు. కార్యదర్శులను డబ్బుల కోసం ఎవరినీ వేధించలేదని, కొంతమంది కార్యదర్శులకు సహకరించకపోవడంతోనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సమాధానం ఇచ్చారు.

వాహనదారులకు తప్పని తిప్పలు



నీటిని మళ్లిస్తున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వచ్చే మార్గంలోని తెల్లాపూర్ కమాన్ వద్ద నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు రోడ్లపై చేరుతోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డు జలమయం కావడంతో సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఏఈ సంజయ్‌కుమార్‌తో కలిసి జేసీబీతో కాలువ తవ్వించి నీటిని మళ్లించారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



హత్నూరలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



కంది: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



జిన్నారంలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినంగా సందర్భంగా హత్నూర మండల కేంద్రంలో స్టార్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంగారెడ్డి, హత్నూర మాజీ సర్పంచ్ జయశ్రీ శివశంకర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనంతరం హత్నూర గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ సందీప్, డాక్టర్లు ఎస్తేరు, శ్రీకాంత్, కిషోర్, వంశీ, మాజీ సర్పంచ్ మహంకాళి నాగేష్, మాజీ జెడ్పీటీసీ మైసగళ్ల ఆశయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంది మండల పరిధిలో...

కంది(సంగారెడ్డి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కందిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినానికి పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మహిపాల్ రెడ్డి, మాణిక్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్‌చైర్మన్ మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సరళ, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలాన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి, పుండరీకం, సతీష్, సాయికిరణ్, శ్రీకాంత్, ప్రభు, యాదిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో...

జోగిపేట(అందోల్): మాజీ మంత్రి హరీష్‌రావు జన్మదిన వేడుకలను జోగిపేటలో బీఆర్‌ఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ డీబీ నాగభూషణం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ అధ్యక్షుడు వెంకటేశం, మాజీ సర్పంచ్ శంకరయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల శంకర్, నాయకులు వీరేశం తదితరులు పాల్గొన్నారు.



జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

చోఖా మేళా ఉత్సవాలు ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ దత్తాత్రేయ ఆశ్రమంలో సోమవారం నుంచి చోఖా మేళా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహారాష్ట్రలోని పండరీపూర్‌కు చెందిన రాజేంద్ర మహారాజ్ కీర్తన వినిపించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వారికార్ భక్త బృందంతో పాటు భక్తులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

చిన్నశంకరంపేట(మెదక్): 30 నెలలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ ప్లే స్కూల్‌కు పంపించాలని కోరుతూ చిన్నశంకరంపేటలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్లే స్కూల్‌లో చిన్నారుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రం–3 టీచర్ నాగరాణి, చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సాపూర్: బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేశ్‌గౌడ్‌ను బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు సోమవారం పరామర్శించారు. చిన్నరమేశ్ తల్లి యాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో రఘునందన్‌రావు బీజేపీ నాయకులతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ ఉన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పంపిణీ చేసిన సైకిళ్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలు, తండా నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు హెచ్‌సీజీ (హైదరాబాద్ సైకిల్ గ్రూప్) బృంధం సోమవారం 22సైకిళ్ల పంపిణీ చేసింది. మండలంలోని ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు అజ్జమర్రి గ్రామం నుంచి 20 మంది, ఫైజాబాద్ తండా నుంచి ఇద్దరు బాలికలు ఫైజాబాద్ ఉన్నత పాఠశాలకు ప్రతీ రోజు 3 కిలోమీటర్ల నడుచుకుంటూ వస్తారు. దీంతో సైక్లింగ్‌డే పురస్కరించుకొని హెచ్‌సీజీ బృందం విద్యార్థినులకు 22 సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం తారాసింగ్ తెలిపారు. దీంతో విద్యార్థులకు సౌకర్యంగా మారనుందన్నారు. హైదరాబాద్ నుంచి ఫైజాబాద్‌కు సైకిళ్లను తీసుకొనివచ్చేందుకు అజ్జమర్రి మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి సహకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, శేఖర్, పాండురంగం పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. మండల పరిధిలోని కొంతాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో 1997 – 98 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక చోట కలుసుకున్నారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో సమ్మేళనం నిర్వహించి, అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.